నేడు బంగారుపాళ్యంలో

జగనన్నకు చెబుదాం : కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ప్రజాసమస్యల పరిష్కారానికి మండలస్థాయిలో జగనన్నకు చెబుదాం కార్యక్రమ నిర్వహణలో భాగంగా ఈనెల 27వ తేదీన బంగారుపాళ్యం ఎంపిడిఓ కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎస్. షన్మోహన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, ప్రత్యేక అధికారులు, మండల, గ్రామస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలని తెలిపారు.

తిరుపతి సభలో మాట్లాడుతున్న భువనేశ్వరి

సభకు హాజరైన జనం

రాష్ట్ర భవిష్యత్ కోసం పోరాడదాం..!

నాలుగున్నరేళ్లలో ఒక్క పరిశ్రమైనా వచ్చిందా.? / ఎండుతున్న పొలాలకు నీళ్లివ్వండి / 'నిజం గెలవాలి' సభలో నారా భువనేశ్వరి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో, తిరుపతి టౌన్

'రాష్ట్ర అభివద్ధి కోసం ప్రజలు పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.. వైసిపి పాలనలో రాష్ట్రానికి ఒక్క పరిశ్రమైనా వచ్చిందా..మన బిడ్డలకు ఒక్క ఉద్యోగమైనా ఇచ్చారా.. నిర్బంధాలతో భయపెట్టడం కాదు.. ముందు ఎండుతున్న పొలాలకు నీళ్లివ్వండి' అని నారా భువనేశ్వరి అన్నారు. ప్రభుత్వ దష్టి చంద్రబాబు రాసిన లేఖపై కాదని, అభివద్ధిపై పెట్టాలన్నారు. 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా రెండో రోజు తిరుపతిలోని అంకుర ఆసుపత్రి పక్కన ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో గురువారం భువనేశ్వరి ప్రసంగించారు. "మా ఇంట్లో ఎప్పుడు శుభకార్యం జరిగినా మా మనసులోకి వచ్చేది వెంకటేశ్వరస్వామి. ఎప్పుడు వెళ్లినా కుటుంబ సమేతంగా వెళ్లేదాన్ని..కానీ మొన్న ఒక్కదాన్నే వెళ్లాను. చంద్రబాబు అరెస్టుతో నలుగురం నాలుగు దిక్కులయ్యాం. చంద్రబాబును నిర్బంధించి 48 రోజులు అయింది. మనవడు దేవాన్ష్ ను చూడక 48 రోజులు అయింది. తిరుపతిని ఎన్టీఆర్ ఎలా అభివద్ధి చేశారో మీ అందరికీ తెలుసు. తిరుపతి వెంకటేశ్వరస్వామి సన్నిధిలో నిత్యాన్నదానాన్ని ఎన్టీఆర్ ప్రవేశపెట్టారు. తర్వాత చంద్రబాబునాయుడు కూడా తిరుపతిని అభివద్ధి చేశారు. 2014లో చంద్రబాబు సీఎం అయ్యాక రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో ఒక రంగాన్ని అభివద్ధి చేయాలని నిర్ణయించారు. అనంతపురం జిల్లాను ఆటోమొబైల్ హబ్ గా మార్చారు. చిత్తూరు జిల్లాను ఎలక్ట్రానిక్ మ్యానిఫ్యాక్చరింగ్ హబ్ గా తీర్చిదిద్దారు. గతంలో రాష్ట్రానికి వచ్చిన పరిశ్రమల్లో ఇప్పుడు ఒకటి రెండు తప్ప అన్నీ రాష్ట్రం నుండి వెళ్లిపోయాయి. మన రాష్ట్రానికి రావాల్సిన పరిశ్రమలు పక్క రాష్ట్రాలకు వెళ్తున్నాయి. మన రాష్ట్ర యువతకు రావాల్సిన ఉద్యోగాలన్నీ పక్క రాష్ట్రాల యువతకు పోతున్నాయి. అమర్ రాజా బ్యాటరీస్ ఈ జిల్లాలో 30 ఏళ్లుగా ఉంది..వాళ్లనూ ఇబ్బందులు పెట్టారు. రూ.9,300 కోట్ల పెట్టుబడిని తెలంగాణలో పెట్టారు..దీంతో అక్కడి యువతకు ఉద్యోగాలు కల్పించారు. చంద్రబాబు రాజకీయ జీవితం ఎస్వీ యూనివర్సిటీలో స్టూడెంట్ లీడర్ గా ప్రారంభించారు. ఆయన అరెస్టును నిరసిస్తూ యూనివర్సిటీలో ఆయన అభిమానులు దిష్టిబొమ్మను దహనం చేస్తే హత్యాయత్నం కేసులు పెట్టారు. జనసేన మహిళా నాయకలు మీడియాతో మాట్లాడితే కేసులు పెట్టారు. శ్రీకాళహస్తిలో దీక్షలు చేస్తే కేసులు పెట్టారు. ఇదా రాష్ట్ర గొప్పతనం.? మన రాష్ట్రం ఎలా అవుతుందో...భవిష్యత్ ఏంటో అంతా ఆలోచించాలి. నా పోరాటంలో మహాత్మ గుర్తొస్తున్నారు. ఆయన స్వాతంత్ర్యం కోసం పోరాటం చేశారు.. మనం ఇప్పుడు రాష్ట్రంలో ఈ ప్రభుత్వంతో స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్నాం. ఎన్టీఆర్ ఇచ్చిన పౌరుషంతో, చంద్రబాబు ఇచ్చిన క్రమశిక్షణతో పోరాడుదాం." అని భువనేశ్వరి పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో టిడిపి ఎమ్మెల్సీ అనురాధ, టిడిపి మాజీ ఎంపీ పనబాక లక్ష్మి, మాజీ మంత్రి అమర్నాథ్ రెడ్డి, తిరుపతి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ సుగుణమ్మ, టిడిపి తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు నరసింహ యాదవ్, టిడిపి నగర అధ్యక్షులు చిన్నబాబు, టిడిపి మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, టిడిపి రాష్ట్ర కార్యదర్శి దంపూరి భాస్కర్ యాదవ్, టిడిపి కార్పొరేటర్ ఆర్సి మునికష్ణ, టౌన్ బ్యాంక్ మాజీ చైర్మన్ పులిగోరు మురళీకష్ణ రెడ్డి, నాయకులు ఊక విజయ్ కుమార్, ఆంబూరు సింధూజ, పుష్పావతి, జనసేన నాయకులు కిరణ్ రాయలు రాజారెడ్డి పాల్గొన్నారు



శ్రీకాళహస్తిలో స్వాగతం పలుకుతూ...

బాధిత కుటుంబాలకు అండగా....

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి/తొట్టంబేడు

టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టుతో తీవ్ర మనోవేదనకు గురై మతి చెందిన బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని నారా భువనేశ్వరి భరోసా ఇచ్చారు. 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా రెండవ రోజైన గురువారం ఆమె తిరుపతి జిల్లా తొట్టంబేడు మండలంలో పర్యటించారు. చంద్రబాబు అక్రమ అరెస్టుతో తీవ్ర మనోవేదనకు గురై మతి చెందిన కుటుంబాలను ఆమె పరామర్శించారు. తొట్టంబేడు మండలం తంగేళ్లపాళెంలో మోడెం వెంకట్రమణ, కొణతనేరిలో గాలి సుధాకర్, కాసరంలో పరుచూరి వెంకట సుబ్బయ్య గౌడ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి ఒక్కొక్కరికి రూ.3లక్షల వంతున ఆర్థిక సాయం చెక్ రూపంలో అందజేశారు. చంద్రబాబు సూచనలతో తాను క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ బాధిత కుటుంబాలకు సాయం చేస్తున్నానని తెలిపారు. అంతకు మునుపు నారా భువనేశ్వరికి శ్రీకాళహస్తి పట్టణంలోని ఏపీసీడ్స్ కూడలి వద్ద తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికాయి. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇన్ ఛార్జి బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి, శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యేలు ఎస్సీవీనాయుడు, సత్రవాడ మునిరామయ్య, బొజ్జల బందమ్మ, బొజ్జల రిషితారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతి నాయుడు, మండల అధ్యక్షులు గాలి మురళినాయుడు, రావిళ్ల మునిరాజా నాయుడు, చెంచయ్యనాయుడు, టీడీపీ నేతలు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి, చల్లా బాబు, గాలి భానుప్రకాశ్, నరసింహ యాదవ్, చక్రాల ఉష, గుడ్లూరి మోహన్ కిషోర్ నాయుడు, డాక్టర్ పోతుగుంట రాజేష్, ఎస్సీవీ దిలీప్, సత్రవాడ ప్రవీణ్, బాలాజీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉట్టెక్కిన ఉ(లా)ల్లి

ప్రజాశక్తి - బాలాయపల్లి

టమోటా ధర కిలో 200 వరకూ వెళ్లి రెండు నెలలు బహిరంగ మార్కెట్లో రాజ్యమేలింది.. ప్రస్తుతం కిలో 10-15 మధ్య ధర పలుకుతూ పతన దిశలో ఉంది. వెనువెంటనే మార్కెట్లో ఉల్లి ధర పెరగనుందని పెద్దఎత్తున ప్రచారం ఆగస్టులోనే మొదలయ్యింది.. దీంతో వ్యాపారులు పెద్దఎత్తున గోదాముల్లో ఉల్లి నిల్వ పెట్టారు. అయితే ధర పెరగకపోవడంతో వ్యాపారులు గోదాముల్లో నిల్వలను బయటకు తీశారు. ప్రస్తుతం అక్టోబర్ నెలాఖరులో ఉల్లి ఉట్టెక్కింది. మార్కెట్లో కిలో రూ.45-50 ధర పలుకుతోంది. దీపావళి నాటికి ఈ ధర మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపార వర్గాలు అంచనా వేస్తూ మళ్లీ గోదాముల్లోకి ఉల్లిని మళ్లించే ప్రయత్నాలు చేస్తుండటం గమనార్హం. దేశంలోనే అతి పెద్ద ఉల్లి మార్కెట్ ఉన్న మహారాష్ట్రతో పాటు, కర్నాటకలోనూ ఇటీవల భారీ వర్షాలు కురిసాయి. దీంతో ఉల్లి పంట దెబ్బతింది. ఫలితంగా బహిరంగ మార్కెట్లో కొరత ఏర్పడింది. ఈ కారణంగా ధరలు పెరుగుతున్నాయని సమాచారం.

మార్కెట్లో ఉల్లి ధరలు పెరుగుతున్నా దాన్ని గరిష్ఠస్థాయిలో పండించే రాష్ట్రాల్లో గతంలో వర్షా భావం వల్ల దిగుబడి తగ్గింది. వర్షాకాలంలో కర్ణాట కలోని రైతులు ఉల్లిని అధికంగా పండిస్తుం టారు. అయితే ఈ ఏడాది రుతుపవనాలు ఆలస్యం కావ డంతో రైతులు ఉల్లి సాగుపై ఆసక్తి చూపించలేదు. కొన్ని చోట్లు ఉల్లిసాగు చేసినా తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా వేల హెక్టార్లలో నేలకొరి గిందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

వినియోగం అధికం

దేశీయంగా ప్రతి నెలా సగటున 13లక్షల టన్నుల ఉల్లి వినియోగమవుతుంది. దేశంలో ఉల్లి ఎక్కువగా మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, కర్ణాటక, గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాల్లో పండుతుంది. 65శాతం పంట ఒక్క రబీలోనే వస్తుంది. అది ఏప్రిల్-మే మధ్య మార్కెట్లోకి వచ్చి అక్టోబ రు-నవంబరు వరకు ఉంటుంది. అయితే, నిల్వ ప్రక్రియలోనే ఉల్లిపాయలు ఉత్పత్తి బరువులో 30-40శాతం కోల్పోతాయి. కుళ్ళిపోవడంవల్ల కొన్ని వథా అవుతాయి. అలా పరిమాణంతో పాటు నాణ్యతపరంగానూ నష్టం వాటిల్లుతుంది. దేశంలో ఉల్లిపాయలను నిల్వ చేసేందుకు నాణ్యమైన ఏర్పాట్లు లేకపోవడంవల్ల ఏటా రూ.11వేల కోట్ల మేర నష్టం వాటిల్లుతోందని అంచనా. దీపావళి పండగ సీజన్ కావడంతో మున్ముందు ఈ ధరలు మరింత పెరగవచ్చనే అంచనాలున్నాయి. ఈ పరిణామాలను దష్టిలో ఉంచుకొని ధరల కట్టడికి కేంద్రం చర్యలు చేపట్టింది. ఉల్లి ఎగుమ తులపై విధించే పన్నును ఆగస్టులో 40శాతం మేర పెంచింది. ఈ పన్ను ఏడాది చివరివరకు అమల వుతుంది. ఈ చర్యతో ఉల్లి ఎగుమతులు భారీగా తగ్గి, వాటి ధరలు నిలకడగా ఉంటాయన్నది ప్రభు త్వ యోచన.

కన్వర్షన్ చేయని గృహనిర్మాణాలను రద్దు

డిసెంబర్ 10 నాటికి లక్ష్యాన్ని పూర్తి చేయాలి: కలెక్టర్

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ షన్మోహన్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్, చిత్తూరు : రాష్ట్ర ప్రభుత్వం గృహనిర్మాణాలకు, ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని వీటి నిర్మాణ పురోగతి వేగవంతంగా నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్ అన్నారు. గురువారం సాయంత్రం కలెక్టర్ ఎంపిడీవోలు గహనిర్మాణ సిబ్బంది క్షేత్రస్థాయి ఇంజనీరింగ్ సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలని లక్ష్యాలను నిర్ణయించుకున్నప్పుడు పూర్తి చేయాల్సిన బాధ్యత కూడా చూసుకోవాలన్నారు. అదేవిధంగా స్టేజీల వారీగా కన్వర్షన్ చేయని గృహనిర్మాణాలకు సంబంధించి అనుమతులు రద్దు చేయాలని, జాబితాలను సచివాలయాలలో ప్రదర్శించాలని ఆదేశించారు. అడ్వాన్స్‌కు అర్హత ఉన్నవారికి తప్పనిసరిగా అడ్వాన్స్ ఇచ్చి గృహనిర్మాణాలు వేగవంతం అయ్యేలా చూడాలన్నారు. గహ నిర్మాణాల్లో లక్ష్యాలు చేరని మండలాల గురించి ప్రస్తావిస్తూ వేగవంతం చేసి పూర్తి చేయించాల్సిన బాధ్యత అందరి మీద ఉందని తెలిపారు. జిల్లాలో 496 గ్రామ సచివాలయాలు, 440 రైతు భరోసా కేంద్రాలు, 296 వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం జరిగిందని, లక్ష్యాల మేరకు నవంబర్ 5 నాటికి 122 భవనాలను పూర్తి చేయాలన్నారు. ఈసందర్భంగా నిర్మాణాలలో వెనుకబడిన మండలాల గురించి ప్రస్తావిస్తూ వేగవంతం చేయాలన్నారు. అదేవిధంగా డిసెంబర్ 10నాటికి చేరాల్సిన లక్ష్యాలను నిర్దేశించుకోవాలన్నారు. జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, గహనిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ పద్మనాభం, పంచాయతీరాజ్ ఎస్ఇ చంద్రశేఖర్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఈఈ చంద్రశేఖర్ రెడ్డిలు పాల్గొన్నారు.

ఎస్వీయూకు ఐఎస్ఓ గుర్తింపు : విసి

ప్రజాశక్తి - క్యాంపస్ : రాష్ట్రంలో 69 సంవత్సరాలుగా అత్యున్నత ప్రమాణాలతో విద్యనందిస్తున్న శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయానికి ఐయస్ఓ గుర్తింపు లభించడం పట్ల ఉపకులపతి ఆచార్య కె.రాజారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. అక్టోబర్ 25, 26 తేదీల్లో హైదరాబాద్ కు చెందిన హెచ్ ఓయమ్ ఇంటర్నేషనల్ సంస్థ రెండు రోజుల పాటు ఎస్వీయూను సంపూర్ణంగా పరిశీలన చేసిందని, బందం సభ్యులు టీమ్ లుగా వివిధ శాఖలను , పరిపాలనా భవనాన్ని విద్యాప్రమాణాలను, అవస్థాపన సౌకర్యాలను క్షుణ్ణంగా పరిశీలించారని విసి తెలిపారు. గురువారం సాయంత్రం ఐయస్ఓ ప్రతినిధి శివయ్య విసి ఆచార్య కె. రాజారెడ్డిని కలసి ఐయస్ఓ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ ఎస్వీయూ గత సంవత్సరం ఐయస్ఓ నంబర్ ను పొందడం జరిగిందని, ఈ సంవత్సరం కూడా మనకు అన్ని సౌకర్యాలు ఉన్నాయని ఐయస్ఓ బందం నిర్ధారణ చేసి సర్టిఫికేట్ ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య మహమ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ విసి ఆచార్య రాజారెడ్డి మార్గదర్శకత్వంలో హెచ్ఓయమ్ -ఇంటర్నేషనల్ సంస్థ ఎస్వీయూను రెండు రోజులు సందర్శించి, వివిధవిభాగాలను తమ ఆడిట్ తో అంచనా వేసి ఎన్విరాన్మెంట్ -గ్రీన్ లో ఐయస్ఓ14001 సర్టిఫికేషన్, ఎడ్యుకేషన్ క్వాలిటీ మేనేజ్మెంట్ లో ఐయస్ఓ :210001 సర్టిఫికేషన్ ,ఎనర్జీ సేవింగ్ లో ఐయస్ఓ 50001: గుర్తింపును, ధ్రువీకరణ పత్రాలను అందజేశారని తెలిపారు. సిడిసి డీన్ అప్పారావు, నరసింహ పాల్గొన్నారు.

వాటర్ షెడ్ పనులు తనిఖీ చేసిన కేంద్ర బృందం

ప్రజాశక్తి- చిత్తూరు: అమృత్ సరోవర్ పనులు రైతులకు ఉపయోగపడే విధంగా అధికారులు కృషి చేయాలని, వాటిని భూగర్భ జలాల పెంపొందించేందుకు అనువుగా రూపుదిద్దుతే చర్యలు మరింత చేపట్టాలని కేంద్ర జలశక్తి బందం కోరారు. జిల్లాలో రెండు రోజుల పర్యటనలో భాగంగా మొదటి రోజు గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు సదుం, సోమల, చౌడేపల్లి, బంగారుపాళ్యం మండలాల పరిధిలోని వివిధ గ్రామ పంచాయతీలలో ఉపాధి హామీ పథకం ద్వారా ఏర్పాటు చేసిన అమృత్ సరోవర్ చెరువులు, కుంటలు, చెక్ డ్యాం పనులను కేంద్ర జలశక్తి అభియాన్ కమిటీ బందం నోడల్ ఆఫీసర్ సచీంద్ర కుమార్ పట్నాయక్, శాస్త్రవేత్త సోమరేంద్రో సింగ్ పరిశీలించారు. అమృత్ సరోవర్, ఫీడర్ చానల్ చేపట్టిన అభివద్ధి పనుల పురోగతిని కమిటీ బందం పరిశీలించి చెక్ డ్యాంలు నిర్మించడం వల్ల రైతులకు ఎలాంటి ఉపయోగాయాలున్నాయని కమిటీబృందం రైతులను అడిగి వివరాలను తెలుసుకున్నారు. చెక్ డ్యామ్స్‌లు ఏర్పాటు చేయకముందు వ్యవసాయ బోర్లలో నీరులేక పంటలు ఎండిపోయాయని, చెక్ డ్యాంల వల్ల చుట్టుపక్కల బోర్డులలో నీటి శాతం పెరిగిందని, దీనివల్ల రైతులకు వ్యవసాయానికి ఎంతోగానో ఉపయోగకరంగా ఉందని రైతులు కమిటీ బృందానికి వివరించారు. అమృత్ సరోవర్, చెక్‌డ్యామ్స్ పనులకు సంబంధించి వర్క్అర్డ్స్‌ను, యం బుక్స్‌ను పరిశీలించారు. కమిటీ వెంట డ్వామా పిడి గంగభవాని, వాటర్‌షెడ్ అదనపు పిడి ఉమాదేవి, ఏపిడీలు సునీల్, శ్రీనివాసులు, నీలిమా, వాటర్ షెడ్ పిఓలు, ఏపిఓలు, రైతులు ఉన్నారు.



చెక్ డ్యాంలను పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

సోమల: మండలంలో వాటర్ షెడ్ పథకం కింద చేపట్టిన పనులను కేంద్ర జలశక్తి అభియాన్ కమిటీ బందం గురువారం తనిఖీ చేసింది. ఎస్ నడింపల్లె పంచాయతీ సూరయ్యగారిపల్లె సమీపంలో లక్ష 57 వేల రూపాయలతో నిర్మించిన అమత్ సరోవర్ చెరువు, ఇరికిపెంట వద్ద 3లక్షల 87 వేల రూపాయలతో నిర్మించిన చెక్‌డ్యాం పనులను కేంద్ర బృందం నోడల్ ఆఫీసర్ సచీంద్రకుమార్ పట్నాయక్, సైంటిస్ట్ డాక్టర్ సోమంరేంద్రో సింగ్ పరిశీలించారు.

పోలీసు ఆయుధాల ప్రదర్శన

సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు ఎస్పీ పిలుపు

పోలీస్ ఆయుదాల ప్రదర్శను తిలకిస్తున్న ఎస్పీ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రెండో పోలీసు అమరవీరుల వారోత్సవాలలో భాగంగా ప్రతి ఏటా పోలీసు అమరవీరులను స్మరించుకుంటూ నిర్వహించే ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని జిల్లా ఏఆర్ పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ వై.రిశాంత్ రెడ్డి ప్రారంభించారు. జిల్లా ఏఆర్ పోలీసు కార్యాలయంలోని పరేడ్ మైదానంలో జిల్లా పోలీసులు వినియోగించే ఆయుధాలు, పరికరాలు, సాధనాలను ఓపెన్ హౌస్ కార్యక్రమంలో భాగంగా ప్రదర్శనలో ఉంచారు. ఈ సందర్భంగా ఎస్పీ మీడియాతో మాట్లాడుతూ పోలీసు అమరవీరుల వారోత్సవాలలో భాగంగా ఈ కార్యక్రమం గురు, శుక్రవారం నిర్వహిస్తున్నామని తెలిపారు. పోలీసు వ్యవస్థ పనితీరు గురించి, పోలీసులు తమ దైనందిన విధుల్లో వినియోగించే వివిధరకాల ఆయుధాలు, పరికరాలు, సాధనాల గురించి కళాశాల, పాఠశాల విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు ఆయుధాల గురించి ఎఆర్ సిబ్బంది అవగాహన కల్పించారు. ఎలాంటి సందర్భంలో ఎలాంటి ఆయుధాన్ని వినియోగిస్తారు, వాటి పని తీరు గురించి వివరించారు.

ప్రదర్శనలో ఉంచిన విభాగాలు..

డాగ్ స్క్వాడ్, ఆయుధాల ప్రదర్శన, బాంబు డిటెక్షన్ స్క్వాడ్ విభాగం, కమ్యూనికేషన్ విభాగం, ఫింగర్ ప్రింట్స్, క్లూస్ టీం, ట్రాఫిక్ విభాగం, దిశా యాప్‌పై అవగాహన, పోలీస్ ఆఫీసర్స్ కేడర్స్, ఎర్రచందనం, ఎస్ఈబీ, సైబర్ క్రైమ్ ప్రత్యేక స్టాల్‌ను ప్రదర్శన చేసి సైబర్‌నేరాల పట్ల యువతలో అవగాహన కల్పించారు, పోలీస్ వాహనాల ప్రదరశన, ఫ్రీగో వెహికల్స్, దిశా మొబైల్ రెస్ట్ రూమ్స్ వాహనం తదితర వాహనాలను ప్రదర్శనలో ఉంచారు. ప్రత్యేక థియేటర్ ఏర్పాటు చేసి విద్యార్థులకు పోలీసుల త్యాగాలు, సైబర్ క్రైమ్ వీడియోలు ప్రదర్శించారు.

గృహ సారధులే కీలకం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: రాబోవు ఎన్నికల్లో వైయస్సార్ గృహసారథిలే కీలకమని పూతలపట్టు శాసనసభ్యులు ఎంఎస్.బాబు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో 'ఆంధ్రప్రదేశ్‌కు జగన్మోహన్ రెడ్డి ఎందుకు కావాలనే' కార్యక్రమం వైస్ఎంపీపీ శిరీష్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ వాలంటరీలు, గహ సారధులే కీలకవని, వీరు ప్రతి గడపకు వెళ్లి గత తెలుగుదేశం ప్రభుత్వం మేనిఫెస్టో, వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టో తెలిపి వాటిలో లబ్ధి పొందారన్న వివరాలు నమోదు చేసి, ఆ వివరాలన్నీ వైఎస్సార్‌సీపీ హైప్యాక్‌కు పంపాలని సూచించారు. పాలఏకిరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్ రాజా, ఎంపీపీ అమరావతి వైస్ ఎంపీపీ జయ కుమార్, జడ్పిటిసి సోమశేఖర్, సింగల్ విండో చైర్మన్ దత్తురెడ్డి, ఏఎంసి ఛైర్మన్ సోమశేఖర్, వడ్డెర, కురబ ఈడిగ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్లు మొగిలేశ్వర అమర్నాథ్, ఎల్లప్ప, సర్పంచుల సంఘం అధ్యక్షులు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎమ్మెస్ బాబు

ఎంబీఏ ఫలితాలలో ...

విజయం బిజినెస్ స్కూల్ ముందంజ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:

స్థానిక విజయం బిజినెస్ స్కూల్, శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ ఆగష్టు నెల 2023లో నిర్వహించిన ఎంబీఏ రెండవ సంవత్సరం నాల్గో సెమిస్టర్ ఫలితాలలో 98శాతం ఉత్తీర్ణత సాధించారని విజయం విద్యాసంస్థల అధినేత డాక్టర్ తేజోమూర్తి తెలిపారు. పరీక్షలకు హాజరైన 116 మంది విద్యార్థులలో 114మంది అన్ని సబ్జక్ట్స్‌లో ఉత్తీర్ణులు అవ్వగా వారిలో 78మంది విద్యార్థులు డిస్టింక్షన్, మిగిలిన వారందరు ప్రథమశ్రేణిలో పాస్ అయ్యారని వారందరికీ అభినందనలు తెలిపారు. అకాడమిక్ డైరెక్టర్ శైలజామూర్తి విద్యార్థులను అభినందిస్తూ మావిద్యార్థులు ఇటు అకాడమిక్ పరంగా, నిర్వహణ మెళకువలలో కూడా అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తూ విజయం విద్యాసంస్థల పేరు నిలబెడుతున్నారని తెలియచేశారు. ఉత్తమ ప్రతిభ కనపరిచిన వారిలో కే.శరత్ కుమార్ (7.58), అంజుమ్ సుల్తానా (7.51), రాయపాటి సాయినిఖిత (7.48), మొహమ్మద్ అజీజ్ అయేషా సిద్ధికా (7.45), ఎస్.రితిక (7.45), టిఏ.నాగలక్ష్మి (7.43) గ్రేడ్ పాయింట్స్ సాధించారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.మురళి కష్ణ, ఎంబిఏ విభాగాధిపతి డాక్టర్ శేషగిరిరావు, కవిత, డాక్టర్ జయంత్, ఇతర అధ్యాపకులు అభినందించారు.

బ్రహ్మోత్సవ బహుమానం రూ.16వేలివ్వాలి

ఈవోకు టిటిడి ఎస్‌డబ్ల్యుఎఫ్ వినతి

ఈవోకు వినతిపత్రం ఇస్తున్న నేతలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ : టిటిడి ఉద్యోగులకు బ్రహ్మోత్సవ బహుమానం రూ.16వేలు, కాంట్రాక్టు కార్మికులకు 10వేల చొప్పున ఇవ్వాలని టిటిడి ఎస్‌డబ్ల్యుఎఫ్ నేతలు ఈవో ఎవి ధర్మారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఈవో స్పందిస్తూ బోర్డులో చర్చిస్తామని హామీ ఇచ్చారు. ప్రతి ఏటా 10శాతం బ్రహ్మోత్సవ బహుమానం పెంచి ఇచ్చేలా బోర్డులో శాశ్వత ఆర్డర్ ఇవ్వాలని కోరారు. ఉద్యోగుల ఇంటి స్థలాలకు రేటు ఫిక్స్ చేసి త్వరగా ప్రొసీడింగ్‌సతో పాటు ఇంటి స్థలాలను రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలని కోరారు. పెన్షనర్లకు మరో 250 ఎకరాల స్థలం గుర్తించడం జరిగిందని, త్వరలోనే కలెక్టర్ ఇస్తారని తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఉద్యోగులకు ప్రమోషన్లు పెండింగ్ లేకుండా చూడాలని కోరారు. ఇందువల్ల ఏర్పడిన ఖాళీ పోస్టులను ఉద్యోగ పిల్లల కారుణ్య నియామకాల ద్వారా భర్తీ చేయాలని కోరారు. నాలుగో తరగతి ఉద్యోగులకు నగదు రహిత వైద్యస్కీంలో అడ్మిట్ అయిన వారికి జనరల్ వార్డు కాకుండా షేరింగ్ కల్పించాలని కోరారు. మంజూరైన రేడియో, బ్రాడ్‌కాస్టింగ్ డిఇ పోస్టును ఎలిజిబిలిటీలో ఉన్న టిటిడి ఎలక్ట్రికల్ డిఇతో భర్తీ చేయాలని కోరారు. పై సమస్యలకు ఈవో సానుకూలంగా స్పందించారని నాయకులు గోల్కొండ వెంకటేశం, కాటా గుణశేఖర్, నైనారు పద్మనాభం, శ్రీలక్ష్మి, డి.రవికుమార్, ఎ.నరేష్, ఆదిలక్ష్మి, ప్రతిభాభారతి పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

భోజనాన్ని తనిఖీ చేస్తున్న వైస్ ఎంపిపి ప్రభాకర్

ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రమైన సోమలలోని ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని వైస్ఎంపిపి ప్రభాకర్ తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు మధ్యాహ్న భోజన వసతి కల్పిస్తోందని దీనిని పూర్తి నాణ్యతో మెనూ ప్రకారం విద్యార్థులకు వడ్డించాలని నిర్వాహకులకు సూచించారు. ఎంఈఓ శివరత్నమ్మ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

'29న చలో గుంటూరు'

వాల్ పోస్టర్ ఆవిష్కరణ

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దూదేకుల సంఘం నేతలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూర్బాష్, దూదేకుల కులస్థుల గుంటూరులో ఈనెల 29 ఆదివారం జరిగే సింహగ్జన సభను విజయవంతం చేయాలని ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాకార్యదర్శి గురువారం షకీల్ అహ్మద్ ఓ సమావేశంలో కోరారు. దూదేకుల కులస్థులు రాష్ట్రంలో లక్షలాదిగా ఉన్నా ఇంకా వెనుకబడి ఉన్నారని, ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజి ద్వారా ఆదుకోవాలని ఆమె కోరారు. అలాగే ప్రతి పార్టీ జిల్లాకు ఒక శాసనసభ సీటు ఇవ్వాలని డిమాడ్ చేశారు. అనంతరం గోడ పత్రికను విడుదల చేశారు. చిత్తూరు మండల ప్రధాకార్యదర్శి మునీర్ అహ్మద్, కోశాధికారి మహమ్మద్ గఫూర్,జిల్లా సభ్యులు సుభాన్ సాహెబ్, బషీర్ అహ్మద్, ముక్తార్, రియాజ్, మసూద్, జగదీష్, బాబు పాల్గొన్నారు.

'బాల్య వివాహాలను అరికట్టాలి'

ప్రజాశక్తి-కెవిబిపురం: బాల్య వివాహాలను అరికట్టాలని ప్రజా ప్రగతి ట్రస్ట్ శ్రీకాళహస్తి డివిజన్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం స్త్రీశిశు సంక్షేమశాఖ అధికారులతో సంయుక్తంగా బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. చంద్రశేఖర మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలనకు గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. పేదరికం, నిరక్షరాస్యత, సంప్రదాయ వివాహాలు, మేనరిక వివాహాలు జరిపించడం వలన బాలికలకు చిన్న వయసులోనే వివాహాలు చేసుకొని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ప్రోత్సహించేవారిపై చర్యలు తప్పవన్నారు. ప్రజలు చైతన్యవంతులై బాల్య వివాహాలు అరికట్టేందుకు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో మండల కోఆర్డినేటర్ వేణుగోపాల్, అధికారిణి కల్పలత, ప్రజా ప్రగతిట్రస్ట్ సిబ్బంది ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సిసి రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి-ఏర్పేడు: స్థానిక గ్రామ పంచాయతీ అభివృద్ధికి అన్ని విధాల కృషి చేస్తానని సర్పంచుల సంఘం అధ్యక్షుడు నల్లపాలెం శివయ్య అన్నారు. గురువారం సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి సహకారంతో ఇప్పటికే రూ.12లక్షలతో 203 మీటర్ల సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేపడుతున్నట్లు తెలిపారు. ఉప సర్పంచ్ లక్ష్మయ్య, పంచాయతీరాజ్ ఏఈ రవితేజ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ శివచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

నా తండ్రిలా.. నన్నూ ఆదరించండి

రాష్ట్ర వైసీపీ మహిళా అధ్యక్షురాలు కృపాలక్ష్మి



కంటిఅద్దాలను పంపిణీ చేస్తున్న కృపాలక్ష్మి

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: మా తండ్రి కళత్తూరు నారాయణస్వామిని ఆదరించినట్లే నియోజకవర్గ ప్రజలను తననీ ఆదరించాలని డిప్యూటి సిఎం నారాయణస్వామి కుమార్తె, రాష్ట్ర వైసీపీ మహిళా అధ్యక్షురాలు కృపాలక్ష్మి కోరారు. మండలంలోని వేపంజేరి హైస్కూల్‌లో గురువారం కృపాలక్ష్మీ జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపును ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో సీఎం జగనన్న ఆరోగ్య సురక్ష ప్రవేశపెట్టారని అన్నారు. ఐసిడిఎస్ సిబ్బంది ఏర్పాటు చేసిన పోషకాహార స్టాళ్లను పరిశీలించి, పోషకాహార విలువలపై అవగాహన కలిగిన ఐసిడిఎస్ సిబ్బందిని ఆమె ప్రత్యేకంగా అభినందించారు. కంటి పరీక్షలు చేసుకొన్నవారికి కంటి అద్దాలను ఉచితంగా పంపిణీ చేశారు. మండల వైస్ ఎంపీపీ హరిబాబు, వైసీపీ మాజీ మండల కన్వీనర్ సురేంద్రరెడ్డి, ఎంపీడీవో శ్రీదేవి, తహశీల్దార్ ఇన్బనాథన్, డాక్టర్లు షర్మిల, ప్రశాంత్ పాల్గొన్నారు.

బూరగమందలో జగనన్న ఆరోగ్య సురక్ష

సోమల: సదుం మండలం బూరగ మంద సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 385 మంది వైద్య పరీక్షలు నిర్వహించుకోగా దాదాపు 60 మంది కంటి వైద్యపరీక్షలు నిర్వహించుకున్నారు. వీరిలో 12 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. జడ్పిటిసి సోమశేఖర రెడ్డి మాట్లాడుతూ అందరికీ ఆరోగ్యం అనే లక్ష్యంతో ముఖ్యమంత్రి ప్రారంభించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఎంతోమంది వైద్య పరీక్షలు నిర్వహించుకుని తమ ఆరోగ్యం ఎలా ఉందో తెలుసుకుంటూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారని అన్నారు. ఎంపిటీసీ మల్లికార్జున, ప్రకాష్ రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపన్యాస, వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా చిత్తూరు జిల్లా ఎస్పీ వై.రిశాంత్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పోలీస్‌స్టేషన్ పరిధిలో విద్యార్థులు, పోలీస్ కుటుంబాల పిల్లలు, పోలీస్ ఉద్యోగులతో వ్యాసరచన, ఉపన్యాసం పోటీలు నిర్వహించారు. ఇందులో లైంగిక వేధింపుల నుండి మహిళలకు, పిల్లలకు రక్షణ, సోషల్ మీడియా దుర్వినియోగం, సైబర్ మోసాలను అరికట్టడంలో సాంకేతికత పాత్ర అనే అంశాలపై పోటీలను చిత్తూరు పోలీస్ గెస్ట్ హౌస్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించినారు. ఈపోటీల్లో విద్యార్థులు, పోలీసులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ కనబరిచారు. విజయం సాధించిన విద్యార్థులకు మొదటి బహుమతి రూ. 5వేలు, రెండో బహుమతి రూ. 3వేలు, మూడో బహుమతి రూ. 2వేలు ప్రధానం చేయనున్నారు.

వకృత్వ, వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు

రాకేష్‌రెడ్డికి సత్కారం



రాకేష్‌రెడ్డిని సత్కరిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

ప్రజాశక్తి- నగరి: రాష్ట్ర కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్, నగరి నియోజకవర్గ ఇన్చార్జ్ రాకేష్ రెడ్డిని నగరి పట్టణానికి చెందిన రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బాబు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సత్కరించారు. గురువారం తిరుపతికి వెళ్లిన బాబు తనకు రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పదవిని అందించడంలో సహకరించినందుకు రాకేష్‌రెడ్డికి కతజ్ఞతలు తెలిపారు. పార్టీకి నిస్వార్ధంగా పనిచేసిన వ్యక్తికి ఉన్నత పదవిని ఇప్పించడం అభినందనీయమంటూ స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు రాకేష్ రెడ్డికి గజమాలలు, దుస్సాలువలు వేసి తమ ఆనందాన్ని పంచుకున్నారు. మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అల్లాపిచ్చై, రూరల్ అధ్యక్షులు కుమార్, నాయకులు దేశయ్య, వెంకటేశ్, మదన్, చిన్ని, గోపాల్, సతీష్, విజయ్, బాబు, హరీశ్‌కుమార్, ధనంజయులు, దేవన్‌యేసు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో గెస్ట్ లెక్చర్

ప్రజాశక్తి- వెదురుకుప్పం: స్థానిక డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రసాయన శాస్త్రం విభాగం వారు కళాశాల ప్రిన్సిపాల్ అన్నపూర్ణ శారదా దేవి ఆధ్వర్యంలో గురువారం గెస్ట్‌లెక్చర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందరంగా హరితగృహ ప్రభావం, ఓజోన్ లేయర్ క్షీణత వంటి అంశాలపై కార్వేటినగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల రసాయనశాస్త్ర అధ్యాపకులు హరిబాబు గెస్ట్ లెక్చర్ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో పర్యావరణంపై స్పృహ కల్పించేందుకు ఇటువంటి కార్యక్రమాలు అవసరమని తెలిపారు. దీని వలన విద్యార్థులలో పర్యావరణ కాలుష్యం పట్ల అవగాహన కలిగి బాధ్యతాయుతంగా ప్రవర్తిస్తారని తెలిపారు. రసాయన శాస్త్ర అధ్యాపకులు సరిత, ఐక్యు ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ పి.వెంకటేష్, డాక్టర్ ఎల్ఎండి భక్షుశ్రీ, చంద్రబాబు, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

అయోడిన్‌పై ప్రజలకు అవగాహన

ప్రజాశక్తి- యాదమరి: అయోడిన్ కలిగిన ఉప్పుని వాడాలని యాదమరి సిహెచ్ఓ లక్ష్మీనారాయణ బుడితిరెడ్డిపల్లి గ్రామంలో అవగాహన కల్పించారు. గురువారం యాదమరి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని మోర్దానపల్లి సచివాలయం బుడితిరెడ్డిపల్లిలో ప్రజలకు అయోడిన్‌పై అవగాహన కల్పించారు. అయోడిన్ కలిగిన ఉప్పును వాడడం వలన కలిగే లాభాలు గూర్చి వివరించారు. ఎంఎల్‌హెచ్‌పి విష్ణుప్రియ, మహిళా ఆరోగ్య కార్యకర్త విమల, ఆశా కార్యకర్త శ్రీమతి పాల్గొన్నారు.

ఆరోగ్యంపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం హెల్త్ఎడ్యుకేటర్ సావిత్రి విద్యార్థులకు ఆరోగ్యంపట్ల తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కలించారు. విద్యార్థులందరూ చేతులను శుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత శుభ్రత పాటించాలని వివరించారు. అనంతరం రక్తహీనత నివారణకు ఐరన్ మాత్రలను విద్యార్థులతో మింగించారు. కార్యక్రమంలో జోహార్ సుల్తానా, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పేదల భూములు దోచుకోవడం అన్యాయం

ప్రజాశక్తి-రేణిగుంట: పేదల భూములను దోచుకోవడం అన్యాయమని, ఇళ్ల స్థలాలు లేని తమకు పట్టాలు ఇప్పించాలని చెంగారెడ్డి పల్లి గ్రామానికి చెందిన గిరిజనులు రేణిగుంట తహ శీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం ధర్నాచేపట్టారు. ఈ సందర్భంగా సిపి.ఐ(ఎమ్.ఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా ప్రధాన కార్యదర్శి హరికష్ణ మాట్లాడుతూ రేణిగుంట మండలం కరకంబాడి సర్వే నెంబరు 538,548లో ప్రభుత్వ భూమి ఉందన్నారు. అధికార పార్టీ నేతలు ఆక్రమించుకొని దర్జాగా కట్టడాలు చేపడుతున్నారన్నారు. ఆ స్థలంలో ఒక్కో జాగా ఐదు లక్షల చొప్పున సుమారు 100 ప్లాట్లు అమ్ముకున్నారని, అయినా అధికారులు పట్టించుకోవడం దారుణమన్నారు. నిరుపేదలైన గిరిజనులను ఆ స్థలంలో పట్టాలు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజాసంఘ నేతలు, గిరిజనులు పాల్గొన్నారు.

అమెజాన్‌లో అత్యధిక ఆర్డర్లు

ప్రజాశక్తి-తిరుపతిసిటీ: ఆన్‌లైన్ షాపింగ్ సంస్థ అమెజాన్ దసరా ఆఫర్లతో కస్టమర్లను ఆకట్టుకొంది. 48 గంటల్లో అత్యధిక ఆర్డర్‌లు, లావాదేవీలు, నమోదు చేసుకుందని ఆ సంస్థ ఎక్స్‌పీరియన్స్ మార్కెటింగ్ డైరెక్టర్ కిషోర్ అన్నారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ అమెజాన్ ప్రైమ్ సభ్యులు గడిచిన 24గంటల్లో రోజువారి కంటే 18రెట్లు ఎక్కువ షాపింగ్ చేసారన్నారు. స్మార్ట్‌ఫోన్‌లు, ల్యాప్‌టాప్‌లు, టీవీలు, ఫ్యాషన్, బ్యూటీ తదితర ఉత్పత్తులు అధికంగా విక్రయాలు జరిగాయన్నారు. ప్రస్తుతం అమెజాన్ నిర్వహిస్తున్న ఫెస్టివల్ ఆఫర్లను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్రైం న్యూస్

అక్రమమద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: అక్రమమద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో సీఐ చంద్రశేఖర్ తెలిపారు. గురువారం చిత్తూరు రూరల్ స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరోస్టేషన్ పరిధిలో ముందస్తు వచ్చిన సమాచారం మేరకు మండలంలోని కూర్మాయిపల్లి గ్రామం వద్ద నూతనంగా నిర్మించుచున్న ప్రభుత్వ కాలనీ మధ్యలో 3 వరుసలుగా పేర్చబడిన అట్టబాక్సులు పరిశీలించగా కర్నాటక టెట్రా ప్యాకెట్లు ఉండటాన్ని గమనించినట్లు తెలిపారు. అక్రమంగా మద్యంను తరలిస్తున్న నవీన్‌రెడ్డిని అరెస్టు చేసి మద్యంను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి కోర్టుకు తరలించగా 15 రోజులు రిమాండ్‌కు విధించినట్లు సిఐ తెలిపారు. ఎస్సై మోహన్ బాబు, హెడ్ కానిస్టేబుల్ క్రిష్ణయ్య, సుబ్రమణ్యం గౌడు, కానిస్టేబుళ్లు వెంకటేష్, కిరణ్ కుమార్, మమత, గాయిత్రి, చంద్రకళ పాల్గొన్నారు.

స్కూటర్ బోల్తా- వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి- ఎస్ఆర్‌పురం: ద్విచక్రవాహనం బోల్తాపడడంతో స్కూటర్‌పై ప్రయాణిస్తున్న వ్యక్తి తీవ్ర గాయాలైన సంఘటన ఎస్ఆర్ పురం మండలం లోని చిత్తూరు- పుత్తూరు రహదారి 50 బసివిరెడ్డిపల్లి గ్రామం వద్ద గురువారం చోటు చేసుకుంది. నగరి మండలం సత్రవాడ గ్రామానికి చెందిన దండపాణి ద్విచక్ర వాహనంపై తన స్వగ్రామానికి వస్తూ రోడ్డుపై అదుపుతప్పి బోల్తా పడ్డాడు దీంతో అతనికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు 108 ద్వారా చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

తల్లీబిడ్డలు అదృశ్యం..

కేసు నమోదు

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: తల్లీబిడ్డలు అదృశ్యమైన సంఘటన మండలంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై మోహన్ కుమార్ తెలిపిన వివరాల మేరకు మంలంలోని సి.గడ్దూరు గ్రానికి చెందిన సి.రాజేంద్ర భార్య పుష్ప (26) పిల్లలు హేమలత (7), ఉదయ్ (5)లు బుధవారం నుంచి కనిపంచడం లేదు. దీంతో వారు బంధువులు, చుట్టుపక్కల గ్రామాల్లో గాలించారు. అయిన్పటికీ వారి ఆచూకీ తెలియకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



గుండెపోటుతో ఏఎన్ఎం మృతి

ప్రజాశక్తి- గంగాధరనెల్లూరు: మండలంలోని తూగుండ్రం గ్రామానికి చెందిన ప్రభావతి (50) వరత్తూరు ఎఎన్ఎంగా పనిచేస్తున్నారు. బుధవారం అర్ధరాత్రి ఆమెకు గుండెనొప్పి రావడంతో వెంటనే వారి కుటుంబసభ్యులు చిత్తూరుకు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే ఆమె మరణించినట్లు తెలిపారు. ప్రభావతి భౌతికకాయానికి సర్పంచ్ శ్రీబాబు, పిహెచ్‌సి డాక్టర్లు దివ్య, ప్రశాంత్, పిహెచ్ఎన్ శాంతి, ఫార్మాసిస్ట్ రజియా సుల్తానా, ల్యాబ్ టెక్నీషియన్ మహేష్, సూపర్వైజర్ క్రిష్టమ్మ, వైద్యసిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు.

భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

- సిపిఎం డిమాండ్

తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నేతలు

ప్రజాశక్తి-పుత్తూరుటౌన్: వడమాలపేట మండలంలోని ఎస్‌బిఆర్‌పురం జరిగిన భూ ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని సిపిఎం నేతలు డిమాండ్ చేశారు. గురువారం వడమాలపేట తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.వెంకటేష్, దళిత గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నందయ్య మాట్లాడుతూ ఎస్‌బిఆర్‌పురంలోని 287 సర్వే నెంబరుకు పక్కన ఉన్న భూమిని కబ్జాకోరులు ఆక్రమించుకున్నారని మండిపడ్డారు. గంతంలో ఆ భూమిలో పేదలు సాగు చేసేవారన్నారు. గత 30ఏళ్లుగా పేదల ఆధీనంలో ఉన్నా వాటకి పట్టా ఇవ్వలేదని అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా లబ్ధిదారులకి డికెటి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఆ స్థలంలో పని చేస్తున్న జెసిబీలను పంపించి లబ్దిదారులకు తగిన న్యాయం చేస్తామని తహశీల్దార్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రామ్మూర్తి, భూపాల్, రాజేంద్రన్, నాగూర్, చిన్నపాప, యేసయ్య, గోపాల్, సరోజ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీయూలో వరల్డ్ అండ్ అట్మాస్ఫియర్ సైన్సెస్ సదస్సు

ప్రజాశక్తి-క్యాంపస్: ఎస్వియూలో డిపార్ట్మెంట్ ఆఫ్ జియాలజీ ఆధ్వర్యంలో ఐదవ జాతీయ వరల్డ్ అట్మాస్ఫియర్ సైన్సెస్ నిపుణులు కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎస్వీయూ ఉపకులపతి ఆచార్య రాజారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సమావేశం మూడు రోజులు పాటు ఎస్వీయూలో జరుగుతున్నట్లు శాఖ అధ్యక్షులు డాక్టర్ సురేష్ తెలిపారు. ఈ సదస్సును దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాల్లో జియాలజీ విభాగంలో పోస్ట్ డాక్టర్లు ఫెలోషిప్ చేయాలనుకున్న విద్యార్థులను ఎంపిక చేయడానికి నిపుణుల కమిటీ సమావేశమైందన్నారు. దేశవ్యాప్తంగా 21 మంది నిపుణులు హాజరైయ్యారన్నారు. వారు దేశంలోని అన్ని విశ్వవిద్యాలయాల నుంచి వచ్చిన పిడిఎఫ్ అప్లికేషన్లను సమగ్రంగా పరిశీలిస్తారని పేర్కొన్నారు. కమిటీ చైర్మన్ ఆచార్య తలత్ అహ్మద్ , రిజిస్ట్రార్‌ఆచార్య ఓ మహమ్మద్ హుస్సేన్ , ఎస్వీయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య తులసీ రామకష్ణా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన గూడూరు ఎమ్మెల్యే

ప్రజాశక్తి-గూడూరుటౌన్

రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ శాఖ మంత్రి గుడివాడ అమరనాథ్ గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్ కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వరప్రసాద్ మట్లాడుతూ గూడూరు పట్టణంకి ఆటోనగర్ ఇచ్చినందుకు మంత్రికి ధన్యవా దాలు తెలిపినట్లు చెప్పారు. అదేవిధంగా దివంగత నేత గౌతమ్‌రెడ్డి గూడూరులో ఉద్యోగ వసతులు కల్పించటానికి ఎమ్.ఎస్.ఎమ్ పార్క్ ఏర్పాటుకు సంబంధించి హామీ ఇచ్చినట్లు గుర్తు చేశామ న్నారు. అందులో భాగంగా గూడూరు రూరల్ పరిధిలో వంద ఎకరాలు భూమిని ఇచ్చేందుకు అప్పుడు కలెక్టర్ కూడా ప్రోజల్స్ సిద్ధం చేశారని, దీనిపై చొరవ తీసుకోవాలని మంత్రికి విజ్ఞప్తించి నట్లు ఎమ్మెల్యే వివరించారు. అందుకు మంత్రిని నుంచి సానుకూల స్పందన వచ్చిందన్నారు. పట్టనంలో ఆటోనగర్, ఎం.ఎస్.ఎం పార్క్ ఏర్పాటుకి సహకరించిన సీఎంకి కృతఘ్నతలు తెలిపారు.

మంత్రిని కలిసిన గూడూరు ఎమ్మెల్యే

అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు: ఆర్‌కె రోజా

ప్రజాశక్తి-పుత్తూరుటౌన్: అర్హతే ప్రమాణికంగా అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందజేస్తున్నట్లు మంత్రి ఆర్‌కె రోజా అన్నారు. గురువారం పుత్తూరు మున్సిపాలిటీలోని 7వ వార్డు దాసరిగుంట సచివాలయ పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఇచ్చిన హామీల్లో 99శాతం అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పూర్తి పారదర్శకంగా, ఎలాంటి సిఫార్సులు లేకుండా పథకాలు అమలు చేసినట్లు ఆమె వివరించారు. ప్రతి సచివాలయానికి రూ.20లక్షలు చొప్పున నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో అభివృద్ధి పనులకు వినియోగిస్తున్నట్లు స్పష్టం చేశారు. సిఎం వైఎస్ జగన్‌ను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆర్‌కె సెల్వమని, మంత్రి సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ కెఎల్ఎన్ఎడ్డి, చైర్మన్ హరి, వైస్ చైర్మన్లు శంకర్, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో మంత్రి ఆర్‌కె రోజా

ప్రతి ఒక్కరికీ ఆయుర్వేదం చేరువ అవ్వాలి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ప్రతి ఒక్కరిని ఆయుర్వేద వైద్యానికి చేరువ చేయడానికి తిరుపతిలో శుక్రవారం నుండి ఆదివారం వరకు తిరుపతి నగరపాలక సంస్థ కచ్చపి ఆడిటోరియంలో ఆయుర్వేద పర్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని టిటిడి ఎస్వీ ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపాల్, మెడికల్ సూపరి ంటెండెంట్ డాక్టర్ రేణు దీక్షిత్ తెలిపారు. గురువారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో ఆమె మాట్లాడారు. భారత ప్రాచీన సనాతన వైద్యమైన ఆయుర్వేదాన్ని ప్రతి ఇంటికి చేరువ చేయడానికి భారత ఆరోగ్య మంత్రిత్వ శాఖ, ఆల్ ఇండియా ఆయుర్వేదిక్ కాంగ్రెస్, టిటిడి ఆయుర్వేద హాస్పిటల్ సంయుక్తంగా ఈ ఆయుర్వేద పర్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నమన్నారు. ఈ మూడు రోజుల కార్యక్రమంలో దేశంలోని ప్రముఖ ఆయుర్వేద హాస్పిటల్స్ వారు తయారు చేసిన మందులను, వైద్య పద్ధతులను వివరిస్తారన్నారు. పద్మభూ షణ్, పద్మశ్రీ పురస్కార గ్రహీత వైద్య దేవేందర్ త్రిగుణ మాట్లా డుతూ ఈ మూడు రోజుల కార్యక్రమంలో ఫ్రీ కన్సల్టేషన్ తో ఆయుర్వేద వైద్య సేవలను తిరుపతి పుర ప్రజలకు అందు బాటులో ఉంచుతున్నామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కె.వి విజయభాస్కర్ రెడ్డి, డాక్టర్ బి. హరినాధచారి, డాక్టర్ వి.వి ప్రసాద్, డాక్టర్ ఏ. శంకర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

సజ్జల విధానాలతో వైసిపి గల్లంతు

-మాజీ ఎంపీ సుబ్రమణ్యం

ప్రజాశక్తి-నాయుడుపేట: ప్రతిపక్ష పార్టీలను అనగ దొక్కాలన్న దురుద్ధేశంతో వైసీపీ నాయకుడు సజ్జల రామకష్ణారెడ్డి ఉన్నారని, ఆయన అమలు చేస్తున్న విధానాలతో రానున్న ఎన్నికల్లో వైసీపీ గల్లంతు అవుతుందని మాజీ ఎంపీ సూళ్లూరుపేట టిడిపి ఇన్చార్జి సుబ్రహ్మణ్యం అన్నారు. గురువారం నాయుడుపేటలో టిడిపి కార్యాలంయలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసి వైసిపి ప్రభుత్వం జైల్లో ఉంచి ఇబ్బందులకు గురిచేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపక్షాలపై చేస్తున్న కుట్రలు, అనచివేత దోరణిని ప్రజలు గమనిస్తున్నారని వచ్చే ఎన్నికల్లో వైసిపి తడుచుపెట్టుకుపోతుందన్నారు. ఆయన వెంట నాయకులు మురళీకష్ణారెడ్డి, కష్ణయ్య, విజయులునాయుడు, కష్ణారెడ్డి, సుధీర్ రెడ్డి, సుధీర్, నారాయణ తదితరులు ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపి

వెంకటగిరిరూరల్: మండలంలోని పారోల్ గ్రామంలో నాయకులు డాక్టర్ మస్తాన్ యాదవ్ ఆధ్వర్యంలో చేయి చేయి కలుపుదాం చంద్రన్నకు మద్దతుగా నిలుద్దాం కార్యక్రమం గురువారం నిర్వహించారు. పలు ఆలయాల్లో పూజలు నిర్వహించారు.

శ్రీ మల్లేశ్వర స్వామి దేవాలయం
ఆరిమానిపెంట (గ్రా), రామకుప్పం (మం), చిత్తూరు జిల్లా.

e - Procurement Tender
NIT NO. P1/COE/23/40/2023-28, Dt. 18.10.2023

మండపం నిర్మాణము, శాలాహారం, విమానగోపురం మొదలగు నిర్మాణముల కొరకు e - Procurement ద్వారా టెండర్లు కోరడమైనది. వివరములకు https://tender. apeprocurement.gov.in వెబ్‌సైట్‌ను చూడగలరు.

ఇట్లు: ధర్మకర్త

IN THE COURT OF THE 1ST ADDL. JUNIOR CIVIL JUDGE : CHITTOOR
O.S.No. 1276 of 2022

Between:
P.Pandu Reddy ... Plaintiff
And:
M.C.Praveen ...Defendant

NOTICE TO DEFENDANT

M.C.Praveen,
S/o Late M.Chandra Sekhar Chetty
Old D.No.33-1,New D.No.2-3,
Bazar Street, Penumur Town &
Chittoor District

Sir, Please take notice in the above matter stand posted to **30-10-2023** at about **10-30 AM** for your appearance, filing Vakalath and objections if any. Inspite of the notice if you fail to appear and file your objections, either in person or through pleader, the matter will be heard and decided on the available records.

Sd/-D.AMARENDRA BABU,
Advocate for Plaintiff
Cell: 63007 53541
Place: Chittoor, Date : 23-10-2023